- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
04-05-2026

సంపుటి : 01 సంచిక : 43 పేజీలు : 08 వెల : ₹5/-


తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 43 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

# సన్‌రైజర్స్‌కు కేకేఆర్ షాక్



- ఉప్పల్‌లో ఆగిపోయిన హైదరాబాద్ విజయ పరంపర..!
- 7 వికెట్ల తేడాతో విజయం సాధించిన కేకేఆర్
- హ్యాట్రిక్ విజయాలు సాధించిన కోల్‌కతా

**హైదరాబాద్, మే 03 :(మహాప్రభ)**
ఐపీఎల్ 2026లో డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించాలని భావించిన సన్ రైజర్స్ హైదరాబాద్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేక్ వేసింది. తొలుత బాల్‌తో సన్ రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసి, ఆపై బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. దీంతో కేకేఆర్ ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదు చేసింది. ఈ లీగ్‌లో తొలి ఆరు మ్యాచులలో ఒక్క విజయం కూడా సాధించని కేకేఆర్.. తాజాగా హ్యాట్రిక్ విజయాలు సాధించి.. ట్రాక్‌లోకి వచ్చింది. మరోవైపు సన్ రైజర్స్.. 10 మ్యాచులలో నాలుగో ఓటమి నమోదు చేసింది. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత

-మిగతా 3 లో



## కర్ణాటకలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బాట

- ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం

**బెంగళూరు, మే 03 :(మహాప్రభ)**
కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగులు ఉద్యమ బాటపట్టగా, తాజాగా కాంగ్రెస్ అధికారంలో ఉన్న మరో రాష్ట్రం కర్ణాటకలోనూ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 20 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ) పిలుపునిచ్చింది.కార్మిక సంఘాల నాయకులు, రవాణా మంత్రి రామలింగా రెడ్డి మధ్య ఇటీవల జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో మే 20 ఉదయం 6 గంటల నుంచి కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీ, ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ, కేకేఆర్టీసీకి చెందిన బస్సులు నిలిచిపోనున్నాయి. కేఎస్ఆర్టీసీ సిబ్బంది, కార్మికుల సమాఖ్య అధ్యక్షుడు జ్యోతి అనంత సుబ్బారావు శనివారం విలేకరుల సమావేశంలో సమ్మె నిర్ణయాన్ని ప్రకటించారు. 2024 జనవరి నుంచి 25 శాతం జీతం పెంపును తమ సంఘాలు డిమాండు చేసినట్లు ఆయన చెప్పారు. నిర్ణీత కాల వ్యవధిలో వేతన సవరణ అమలు చేయాలని మంత్రిని కోరినట్లు ఆయన తెలిపారు.

-మిగతా 3 లో

## అంతరిక్షంలోకి భారత దృష్టి.

- కక్ష్యలోకి చేరిన శాటిలైట్

3 లో

# అధికారం ఎవరిని వరించేనో!

## బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి నేడే కౌంటింగ్

- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలకు సర్వం సిద్ధం
- ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న లెక్కింపు
- మధ్యాహ్నానికే స్పష్టత వచ్చే అవకాశం
- పశ్చిమ బెంగాల్‌లో భారీ భద్రత





**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికలు ఆఖరి అంకానికి చేరుకున్నాయి. సోమవారం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడికి ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కేరళం, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలకు అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానుంది. ఆయా రాష్ట్రాల్లో ఈసారి రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వ త్రా ఉత్కంఠ నెలకుంది. నేటి మధ్యాహ్నంలోగానే ఫలితాలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. పశ్చిమబెంగాల్ మినహా మిగిలిన అన్ని చోట్ల ఒకే దశలో ఎన్నికలను నిర్వహించారు. బెంగాల్లో మాత్రం రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు రావడంతో అనేక చోట్ల శనివారం రీపోలింగ్ నిర్వహించారు.

-మిగతా 3 లో



## అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

- త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇండ్ల మంజూరు :
- ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా


**కూసుమంచి మే 03 :(మహాప్రభ)**
ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.

-మిగతా 3 లో

## మా అనుమతి లేకుండా ఒక్క నౌక వెళ్లదు!

- జలసంధి దాటనీయబోమని ఇరాన్ వార్నింగ్
- నియంత్రించడం ఇరాన్ సహజమైన హక్కు
- స్పష్టం చేసిన ఆర్మీ ప్రతినిధి అక్రమినియా
- జలసంధిలో సరికొత్త అధ్యాయం మొదలైంది
- చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ తీసుకొస్తామన్న మొజ్తాబా ఖమేనీ

3 లో



## కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

- పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ
- కస్టమర్ల ముసుగులో వచ్చి రెచ్చిపోయిన ఐదుగురు దుండగులు
- నగలు దోచుకుంటూ.. అడ్డుకున్న సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు
- రక్తపు మడుగులో నలుగురు ఉద్యోగులు.. ఒకరి పరిస్థితి విషమం
- పారిపోతూ గాలిలోకి ఫైరింగ్..దొరికిన కీలక ఆధారాలు
- రంగంలోకి దిగిన ఐజీ, సీపీ..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హై అలర్ట్, నాకాబందీ
- బాధితులకు అండగా నిలిచిన రాజకీయ నేతలు, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు



**కరీంనగర్ క్రైమ్ మే 03 :(మహాప్రభ)**
కరీంనగర్ నగరం నడిబొడ్డున, ప్రశాంతంగా గడిచిపోతున్న ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జ్యోతినగర్‌లోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో పట్టపగలు తుపాకుల మోత మోగింది. అత్యంత పకడ్బందీగా, పక్కా స్కెచ్‌తో కస్టమర్ల ముసుగులో లోపలికి ప్రవేశించిన ఐదుగురు దుండగులు క్షణాల్లోనే తుపాకులతో భయానక వాతావరణం సష్టించారు. హాలీవుడ్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించేలా అడ్డుకోబోయిన సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి,

-మిగతా 3 లో

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

## జీవో 7 అందుకోసమే..




**14 లక్షల మంది విద్యార్థులకు వెన్నుపోటు**

- వైఎస్ పథకాలకూ పాతరేస్తున్న సర్కారు
- విద్యార్థిలోకం గర్జిస్తే మంత్రులు రోడ్లపై తిరగరు
- రూ.10 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ



**హైదరాబాద్ మే 03 :(మహాప్రభ)**
రేండున్నరేండ్ల కాంగ్రెస్ అసమర్థ పాలనలో ఇప్పటికే విద్యావ్యవస్థను కుప్పకూలిందని బీఆర్ఎస్ వర్కింగ్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. ఇప్పుడు ఏకంగా ఉన్నత చదువులకు నిరుపేదలను పూర్తిగా దూరం చేసేలా విద్యార్థులకు వెన్నుపోటు పొడుస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దు చేసే కుట్ర భయంకరమైనదని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం

-మిగతా 3 లో



## ఢిల్లీలో ఘోరం

- అగ్నిప్రమాదంలో 9 మంది మృతి
- ఏసీ పేలడంతో ఘటన

**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
ఢిల్లీలోని వివేక్ విహార్ ఏరియా, షహదారాలోని నాలుగంతస్తుల బిల్డింగులో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది.వేకువ ఝామున 3.30 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో 9 మంది మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు దాదాపు 15 మందిని రక్షించాయి. అయితే, సహాయక చర్యలకు చాలా ఆటంకం ఏర్పడింది. ప్రమాదానికి గల కారణాల్ని అధికారులు ఆరా తీస్తున్నారు. మొదట రెండో ఫ్లోర్‌లో మొదలైన మంటలు తర్వాత మూడు, నాలుగు ఫ్లోర్లలోకి వ్యాపించాయి.

-మిగతా 3 లో



## తిరుమలలో భారీ రద్దీ

- ఒక్కరోజే 91వేల మందికి స్వామివారి దర్శనం
- 16 గంటలు క్యూలోనే..

**హైదరాబాద్, మే 03 :(మహాప్రభ)**
ఎండాకాలం సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం రికార్డు స్థాయిలో 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. స్వామివారికి 36,257 మంది తలనీలాలు సమర్పించుకున్నారని, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం ఒక్కరోజే రూ.3.37 కోట్లుగా నమోదై రికార్డు

-మిగతా 3 లో

## సముద్రపు నీటి అడుగున
# అతిపెద్ద త్రివర్ణ పతాకం

-అద్భుత విన్యాసంతో గిన్నిస్ పుటల్లోకి



**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
సముద్రపు నీటి అడుగున 2400 చదరపు మీటర్ల అతిపెద్ద మువ్వన్నెల భారత జాతీయ పతాకం రెపరెపలాడింది. అండమాన్ నికోబార్ దీవుల్లోని రాధానగర్ బీచ్‌లో నిర్వహించిన ఈ అద్భుత విన్యాసం గిన్నిస్ వరల్డ్ రికార్డు పుటల్లోకి ఎక్కింది. సముద్ర జలాల అడుగున త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించేందుకు 223 మంది స్కూబా డైవర్లతో కూడిన బృందం ఈ నెల 2న ఏకకాలంలో సమన్వయంతో పనిచేసింది. ఈ రికార్డును గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధి రిషి నాథ్ అధికారికంగా ధ్రువీకరించి, లెఫ్టినెంట్ గవర్నర్ డికె జోషికి సర్టిఫికెట్‌ను అందజేశారు. సముద్ర జలాల అడుగున ఆవిష్కరించిన జెండా సైజు 2,400 చదరపు మీటర్లు. దీని పొడవు 60 మీటర్లు, వెడల్పు 40 మీటర్లు. ఈ రికార్డును సృష్టించిన జెండాను పాలిస్టర్ మెటీరియల్‌తో తయారు చేయించారు.

# దేశంలో పత్రికా స్వేచ్ఛ పతనం


మీడియా సంఘాల ఆందోళన




**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
దేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రస్తుత స్థితిగతులపై మీడియా సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రిపోర్టర్స్ విఠౌట్ బోర్డర్స్ విడుదల చేసిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచికలో భారత్ 157వ స్థానానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆదివారం న్యూఢిల్లీలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పలువురు మీడియా సంఘాల ప్రతినిధులు, ప్రెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సీకే నాయక్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి రాఘవన్ శ్రీనివాసన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారత్‌లో పత్రికా స్వేచ్ఛ పరిస్థితులు దిగజారాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పాత్రికేయులపై దాడులు యాదృచ్ఛికం నుండి ఉద్దేశపూర్వకంగా మారాయని అంతర్జాతీయ ప్రెస్ క్లబ్‌ల సంఘం అధ్యక్షుడు అవ్వాద్ అన్నారు. నిజం బయటకు రాకుండా అడ్డుకోవడానికి జరుగుతున్న వ్యవస్థీకృత ప్రయత్నమిదని అన్నారు. పాత్రికేయులకు సంఘీభావం అవసరమైన తరుణంలో సమన్వయంతో కూడిన ప్రతిఘటన జర్నలిస్ట్ సంఘాల నుంచి లేదంటూ సీకే నాయక్ వాపోయారు.

## ఆధార్ కార్డ్ ఫార్మాట్
# మార్చే యోచన లేదు

క్యూఆర్ కోడ్ వార్తలపై కేంద్రం వివరణ



**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
ప్రస్తుతమున్న 'ఆధార్ కార్డ్' ఫార్మాట్‌ను మార్చుతున్నట్టు వస్తున్న ఊహాగానాల్ని కేంద్రం కొట్టివేసింది. అలాంటి ప్రతిపాదనేదీ తమ ముందు లేదని, ఫొటోగ్రాఫ్, క్యూఆర్ కోడ్‌తో ఆధార్ కార్డును తీసుకొచ్చే ఆలోచనేదీ లేదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.'ఈ ఏడాది చివరి నాటికి ఆధార్ కార్డ్ డిజైన్‌ను కేంద్రం మార్చబోతున్నదని సోషల్‌మీడియాలో ప్రచారం, మీడియా సంస్థల నివేదికలు ప్రజల్ని అనవసరంగా గందరగోళపరుస్తున్నాయి. ఇవన్నీ తప్పుడు వార్తలు' అని కేంద్రం తెలిపింది. ఆధార్ కార్డ్‌పై ఆధార్ నంబర్, పేరు, అడ్రస్ సహా ఇతర వ్యక్తిగత వివరాల స్థానంలో క్యూఆర్ కోడ్‌ను తీసుకొస్తున్నట్టు వస్తున్న వార్తల్ని కేంద్రం ఖండించింది. ఆధార్‌కు సంబంధించి సోషల్‌మీడియాలో వచ్చే పోస్ట్‌లపై ప్రజలు ఆధారపడవద్దని కోరింది.

## ఖలిస్థాన్ తీవ్రవాదులతో జాతీయ భద్రతకు ముప్పు

కెనడా నిఘా ఏజెన్సీ నివేదిక




**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
ఖలిస్థాన్ వేర్పాటువాదుల విషయంలో కెనడా కీలక నిర్ణయం తీసుకుంది. ఖలిస్థాన్ వేర్పాటువాదులు తమ దేశ జాతీయ భద్రతకు ముప్పుగా కెనడా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. తమ హింసాత్మక తీవ్రవాద ఎజెండాను కెనడాలో ప్రచారం చేయడానికి వేర్పాటువాదుల బృందం వివిధ సంస్థలను వాడుకుంటున్నదని పేర్కొన్నది. ఆదివారం ఈ మేరకు '2025 పబ్లిక్ రిపోర్ట్'ను విడుదల చేసింది. కెనడా కేంద్రంగా ఖలిస్థాన్ వేర్పాటువాదుల (సీబీకేఈ) హింసాత్మక కార్యకలాపాలు ఈ దేశానికి, కెనడా ప్రయోజనాలకు ముప్పుగా నివేదిక పేర్కొన్నది.

## బెంగాల్‌లోని 285 పోలింగ్ కేంద్రాల్లో 21న
# రీపోలింగ్, 24న కౌంటింగ్.. ఎందుకంటే?




**కోల్‌కతా మే 03 :(మహాప్రభ)**
అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో సోమవారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నారు. అయితే పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా నియోజకవర్గంలో మే 21న రీపోలింగ్ జరుగనున్నది ఈ నేపథ్యంలో అక్కడి ఫలితాన్ని మే 24న ప్రకటిస్తారు. ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సందర్భంగా పలు అవకతవకలు జరిగినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ధారించింది. బ్యాలెట్ యూనిట్లపై ఉన్న బటన్లపై నల్ల టేపులు అంటించి ఓ అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించింది. అలాగే ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేసిన వారిని గుర్తించడానికి బ్యాలెట్ యూనిట్ల బటన్లపై పెర్ఫ్యూమ్, సిరా పూసినట్లు నివేదికలో పేర్కొంది.కాగా, పలు పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో ప్రసారంలో సుదీర్ఘ అంతరాలు ఏర్పడినట్లు ఈసీ ధృవీకరించింది. అత్యధిక ఓటింగ్ జరిగే సమయాల్లో స్టోరేజ్ చిప్‌లు ఖాళీగా ఉండటం, సంబంధం లేని ఎన్నికల ఫుటేజీని కలిగి ఉండటంతో పాటు ప్రసార అంతరాలను గుర్తించింది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఓటు వేయకుండా నిరోధించడానికి లేదా బెదిరింపులు, భయపెట్టే ఎత్తుగడలతోపాటు పోలింగ్ కేంద్రాలను బలవంతంగా స్వాధీనం, బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడినట్లు, భారీగా నకిలీ ఓటింగ్ జరిగినట్లు ఈసీ ఆరోపించింది. మరోవైపు ఈ అవకతవకల గుర్తింపుతో పాటు రీపోలింగ్ డిమాండ్ల నేపథ్యంలో ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటింగ్‌ను ఈసీ రద్దు చేసింది. ఆ పోలింగ్ కేంద్రాల్లో మే 21న రీపోలింగ్ నిర్వహించాలని, మే 24న కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించాలని బెంగాల్ ఎన్నికల కమిషనర్‌ను ఈసీ ఆదేశించింది.

## భారత్ అతి పెద్ద ప్రయివేటు
# ఉపగ్రహం 'మిషన్ దృష్టి' విజయవంతం

-మేఘాలున్నా, పొరుగుదేశాలపై నిఘా
-ప్రధాని మోడీ అభినందనలు




**బెంగళూరు మే 03 :(మహాప్రభ)**
భారత అంతరిక్ష రంగంలో ప్రయివేటు రంగం జోరు పెంచింది. బెంగళూరుకు చెందిన 'గెలాక్స్‌ఐ' సంస్థ రూపొందించిన అతిపెద్ద ప్రయివేటు ఉపగ్రహం 'మిషన్ దృష్టి'ని ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు గెలాక్స్ ఐ వ్యవస్థాపకులు సుయాశ్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. భారత్‌లో ప్రయివేటు సంస్థలు రూపొందించిన ఉపగ్రహాల్లో ఇదే అతి పెద్దది. 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి'లో ఆప్టోసార్ అనే ప్రత్యేక హైబ్రిట్ వ్యవస్థ ఉందని సింగ్ పేర్కొన్నారు. ఎలక్ట్రో-ఆప్టికల్ (ఇఒ), సింథటిక్ ఎపర్చర్ రాడార్ (ఎస్?ఎఆర్) సెన్సర్ల సాంకేతిక ద్వారా పనిచేస్తుందన్నారు. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో ఈ తరహా టెక్నాలజీతో పనిచేసే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే అని తెలిపారు. సాధారణ ఉపగ్రహాలు కేవలం వెలుతురు ఉన్నప్పుడు మాత్రమే స్పష్టమైన చిత్రాలను తీయగలవు, కానీ 'మిషన్ దృష్టి' మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం ఎలా ఉన్నా అత్యంత స్పష్టమైన చిత్రాలను పంపే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ఇందులోని 'సింథటిక్ అపర్చర్ రాడార్' దట్టమైన మబ్బులను సైతం చీల్చుకుని, ఎలాంటి లైటింగ్ లేని కటిక చీకటిలోనూ భూమిపై ఉన్న వస్తువులను స్పష్టంగా ఫోటోలు తీయగలదని తెలిపారు. శత్రువుల బంకర్లు, వాహనాల కదలికలు, సరిహద్దుల్లో చొరబాట్లను ఎప్పటికప్పుడు అత్యంత కచ్చితత్వంతో దృష్టి శాటిలైట్ పసిగట్టగలదని పేర్కొన్నారు. ఏకకాలంలో ఆప్టికల్, రాడార్? డేటాను సేకరించి, అవుట్?పుట్?లను ఒకే చిత్రంగా మిళితం చేస్తుందన్నారు. దీనివల్ల సాధారణ ఉపగ్రహాల కంటే 3 రెట్లు ఎక్కువ ఉపయోగకర సమాచారం లభిస్తుందన్నారు. మిషన్? దృష్టి ద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో సహాయం, వ్యవసాయ పర్యవేక్షణ, సరిహద్దు భద్రత, మౌలిక వసతుల ప్రణాళిక లాంటివి మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చు అని పేర్కొన్నారు. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ప్రస్తుతం నిర్వహిస్తున్న 29 భూమి పరిశీలన ఉపగ్రహాలకు ఇది అనుబంధంగా పనిచేస్తుందన్నారు. 'ఆపరేషన్ సిందూర్' వంటి సమయాల్లో బాంబు దాడుల నష్టాన్ని అంచనా వేయడానికి భారత్ విదేశీ శాటిలైట్లపై ఆధారపడాల్సి వచ్చిందని, ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. మిషన్ దృష్టిని గెలాక్స్‌ఐ సంస్థ ఐఐటి -- మద్రాస్‌లో రూపొందించింది.

**మరో 9 ఉపగ్రహాలకు ప్లాన్**
రాబోయే రోజుల్లో ఇలాంటివి మరో 9 ఉపగ్రహాలను ప్రయోగించి ఒక 'కాన్‌స్టెలేషన్' ఏర్పాటు చేయనున్నామని సుయాశ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం దృష్టి శాటిలైట్ 1.5 మీటర్ల అత్యుత్తమ రిజల్యూషన్‌తో చిత్రాలను అందిస్తుందన్నారు. రాబోయే ఉపగ్రహాలు 0.5 నుంచి 0.3 మీటర్ల రిజల్యూషన్‌తో ఉంటాయన్నారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు బోల్తా..

-26 మందికి గాయాలు..
- డ్రైవర్‌కు గుండెపోటే కారణం..?



**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం బస్సు ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడిన ఘటనలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోంది. ఈ క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది.ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడిన వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు. గాయపడ్డవారిని నుర్పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణాపాయం లేదని తెలిపారు. నుర్పూర్ ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం ఈ ఘటనపై విచారణ జరుపుతోంది. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని అధికారులు తెలిపారు.

## భారత్‌కు భారీ ఊరట..
# హర్మూజ్ దాటి వస్తున్న మరో ఎల్పీజీ నౌక



**న్యూఢిల్లీ మే 03 :(మహాప్రభ)**
పశ్చిమాసియా లో ఉద్రిక్తతల నడుమ భారత్ కు భారీ ఊరట లభించింది. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశానికి ఊపిరినిస్తూ.. 46,313 మెట్రిక్ టన్నుల ద్రవరూప పెట్రోలియం గ్యాస్ తో 'సర్వశక్తి ' అనే నౌక హోర్ముజ్ జలసంధి ని సురక్షితంగా దాటి భారత్‌వైపు వస్తోంది. మే 2న జలసంధిని దాటిన నౌక ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ప్రయాణిస్తూ విశాఖపట్నం దిశగా వస్తోంది.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. 'సర్వశక్తి' నౌకలో 18 మంది భారతీయులతో సహా మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌక మే 13న విశాఖపట్నం పోర్టుకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో జరిపిన ద్వైపాక్షిక చర్చల ఫలితంగానే ఈ నౌక ప్రయాణానికి మార్గం సుగమమైంది. ప్రయాణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నౌక తన ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ ద్వారా 'ఇండియా/ఇండియన్ సిబ్బంది' అని నిరంతరం ప్రసారం చేస్తూ ముందుకు కదిలింది.ప్రాంతీయ సంఘర్షణల నేపథ్యంలో గత రెండు వారాల్లో హోర్ముజ్ జలసంధిని దాటిన తొలి భారత అనుసంధాన ఇంధన ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం. ప్రస్తుతం పెర్షియన్ గల్ఫ్‌లో సుమారు 14 భారతీయ నౌకలు చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తున్నది. వాటిని కూడా సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి భారత అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. 'సర్వశక్తి' రాకతో దేశీయ ఇంధన సరఫరాకు కొంతమేర ఉపశమనం కలుగనుంది.

# ఎమర్జెన్సీ డోర్ తెరచి.. కిందికి దూకేసి!

చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో టెన్షన్ రేపిన ప్రయాణికుడు




**చెన్నై మే 03 :(మహాప్రభ)**
ఎయిర్ అరేబియా విమానం ఆదివారం ఉదయం చెన్నై విమానాశ్రయంలో దిగి రన్ వేపై వెళుతున్నప్పుడు ఒక ప్రయాణికుడు(34) అత్యవసర ద్వారాన్ని తెరచి కిందికి దూకిన ఘటన ఉత్కంఠను రేపింది. విమానాశ్రయ అధికారుల వివరాల ప్రకారం.. షార్జా నుంచి చెన్నై వచ్చిన విమానంలో ఈ ఘటన జరిగింది.ప్రయాణికుడి అనుచిత చర్యను గమనించిన వెంటనే పైలట్ విమానాన్ని ఆపేసి ఎయిర్‌పోర్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. భద్రతా సిబ్బంది, బాంబు నిర్వీర్య దళం వెంటనే అక్కడికి చేరుకొని సదరు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకొన్నారు. అతడి మానసిక స్థితిని పరిశీలిస్తున్నారు. అతడు అలా ఎందుకు దూకాడో విచారణ చేస్తున్నారు. పైలట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నిందితుడిని పుదుక్కోట్టై వాసిగా గుర్తించారు.

# సన్‌రైజర్స్‌కు కేకేఆర్ షాక్



మొదటి తరువాయి

బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ ఓ దశలో.. 71/1 (6 ఓవర్లు), 105/1 (8.5 ఓవర్లు)తో నిలిచి.. భారీ స్కోరు చేసేలా కనిపించింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడింది. చివరి 9 వికెట్లను కేవలం 60 పరుగుల వ్యవధిలోనే కోల్పోయింది. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన కేకేఆర్.. ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. ఓపెనర్లు అజింక్య రహానే (36 బంతుల్లో 43 రన్స్), ఫిన్ అలెన్ (13 బంతుల్లో 29 రన్స్) రాణించారు. తొలి వికెట్‌కు 4 ఓవర్లలో 49 పరుగులు జోడించారు. ఆ తర్వాత వచ్చిన రఘువంశీ (47 బంతుల్లో 59 పరుగులు) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.రింకూ సింగ్ (11 బంతుల్లో 22 రన్స్) ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో కేకేఆర్. 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్, శివంగ్ కుమార్, సాకిబ్ హుస్సేన్ తలా ఓ వికెట్ తీశారు.ఈ విజయంతో కేకేఆర్.. తన ఖాతాలో మరో రెండు పాయింట్లు జత చేసింది. మొత్తంగా ఆ జట్టు ఆడిన 9 మ్యాచులలో మూడు విజయాలతో 8వ ప్లేసులో ఉంది. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్.. 10 మ్యాచులలో ఆరు విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో ప్లేసులో కొనసాగుతోంది. కేకేఆర్‌తో మ్యాచులో ఓడిపోయినా.. ఆ జట్టు స్థానం మాత్రం మారలేదు. సన్ రైజర్స్ తన తర్వాతి మ్యాచులో మే 6న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది.


# అధికారం ఎవరిని వరించేనో!..

మొదటి తరువాయి

ఇక ఫల్తా నియోజకవర్గం యావత్తు రీపోలింగ్ కు ఇసి అసాధారణ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. ఇక్కడ ఈ నెల 21న రీపోలింగ్ నిర్వహించనున్నారు. 24న ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ నేపథ్యంలో బెంగాల్ పై ఇసి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాయి. భారీ స్థాయిలో భద్రతను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఈ జాబితాలో ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలున్నాయి. ఈ జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, ఫలితాలు వెలువడే సమయంలో అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించిగా, బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన 'మార్ఫ్‌మ్యాన్' సాయుధ వాహనాలను రంగంలోకి దించారు.

# అంతరిక్షంలోకి భారత దృష్టి.

## - కక్ష్యలోకి చేరిన శాటిలైట్




న్యూఢిల్లీ:
భారత అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. భారత అతిపెద్ద ప్రైవేట్ ఉపగ్రహం 'మిషన్ దృష్టి' రోదసి ప్రయోగం విజయవంతమైంది. ఆదివారం అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి 'స్పేస్ ఎక్స్'కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' శాటిలైట్ ఇది అంటే సాధారణ కెమెరా (ఆప్టికల్), రాడార్ (సింథటిక్ అపర్చర్ రాడార్) టెక్నాలజీని కలిపి తయారుచేసిన హైబ్రిడ్ శాటిలైట్. భూమిపై మబ్బులు సహా ఎలాంటి వాతావరణం ఉన్నా.. అంతరిక్షం నుంచి హై-రిజల్యూషన్ చిత్రాలు తీయటం దీని ప్రత్యేకత. దీనిని రక్షణ, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు భారత్ ఉపయోగించనున్నది.

# ఢిల్లీలో ఘోరం

మొదటి తరువాయి

సమాచారం అందుకున్న అగ్నిమాపక దళాలు, అంబులెన్స్‌లు 22 నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నాయి. ఎయిర్ కండీషన్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అగ్నిప్రమాదం జరిగిన తర్వాత బాధితులు తప్పించుకోవడానికి అవకాశాలు తగ్గిపోయాయి. నాలుగంతస్తుల బిల్డింగ్ అయినప్పటికీ, ఒకటే మెట్ల మార్గం ఉంది. ఒకటే లిఫ్ట్ ఉంది. దీంతో ఈ మార్గాలు మూసుకుపోవడం వల్ల బాధితులు చిక్కుకుపోయారు. ఇక రెండో ఫ్లోర్‌లో అగ్నిప్రమాదం కారణంగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దీంతో స్మార్ట్ లాక్ ఉన్న డోర్లు మూసుకుపోయాయి.ఫైర్ యాక్సిడెంట్ కారణంగా అవి తెరుచుకోలేదు. దీంతో ఆ ఫ్లోర్లోని బాధితులు ఆ రూముల్లోనే చిక్కుకుపోయారు. తర్వాత అందులోని వారి మృతదేహాల్ని సహాయక బృందాలు బయటకు తీశాయి. మంటలు చెలరేగడంతో అక్కడి వారు మేడ పైకి వెళ్లేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పైన డోర్లు మూసుకుపోయాయి. బాల్కనీ కూడా మూసి ఉంది. దీంతో బాధితులకు ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. బాధితులు ముందుగా పొగ ప్రభావానికి గురై కిందపడిపోగా, తర్వాత మంటలకు దగ్ధమయ్యారు.ఫస్ట్ ఫ్లోర్‌లో డోర్లు మూసుకుపోవడం వల్ల మరొకరు మరణించినట్లు తెలుస్తోంది. ఇలాంటి అనేక భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ఈ బిల్డింగులో మృతుల సంఖ్య పెరిగినట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.

# అర్హతే కొలమానం.. రాజకీయాలకు తావులేదు

మొదటి తరువాయి

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా , భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే తమ ప్రభుత్వ బాధ్యతని, ఇందులో ఎలాంటి జాప్యానికి తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రతి



సోమవారం ఇళ్ల నిర్మాణ నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోందని, మే నెలాఖరు నాటికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించారు. వడ్లు, మొక్కజొన్న పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నామని, వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నా మని తెలిపారు. మే 5 నుంచి 7 వరకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మా అనుమతి లేకుండా ఒక్క నౌక వెళ్లదు!

**-జలసంధి దాటనీయబోమని ఇరాన్ వార్నింగ్**
**-నియంత్రించడం ఇరాన్ సహజమైన హక్కు**
**-స్పష్టం చేసిన ఆర్మీ ప్రతినిధి అక్రమినియా**
**-జలసంధిలో సరికొత్త అధ్యాయం మొదలైంది**
**-చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ తీసుకొస్తామన్న మొజ్తాబా ఖమేనీ**




న్యూఢిల్లీ,
హోర్ముజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా మిత్రదేశాలు, శత్రు దేశాలకు చెందిన ఏ ఒక్క నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ 'ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్'.. దేశ సైన్యం సంయుక్తంగా హోర్ముజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని మహమ్మద్ అక్రమానియా తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని అక్రమానియా తేల్చిచెప్పారు. మరోవైపు తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ చెప్పారు.

జలసంధిలో సరికొత్త అధ్యాయం..

ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇరాన్ హోర్ముజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలావుంటే పర్షియన్ గల్ఫ్, హోర్ముజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇటీవల ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ అన్నారు. ఈ జలసంధి నిర్వహణ త్వరలోనే ఒక కొత్త చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకువస్తామని, ఇది ఈ ప్రాంతంలోని అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో పర్షియన్ గల్ఫ్ శాంతి, శ్రేయస్సుతో వర్ధిల్లుతుందని ఆయన పేర్కొన్నారు.

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

మొదటి తరువాయి

నెత్తుటేరులు పారించి, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఈ దుస్సాహస ఘటన యావత్ తెలంగాణలో కలకలం రేపగా, దొంగల వేట కోసం పోలీస్ యంత్రాంగం నగరవ్యాప్తంగా నాకాబందీ విధించి జల్లెడ పడుతోంది. ఉదయం 10.45 గంటల ప్రాంతం. సిబ్బంది లాకర్ల నుంచి నగలు తీసి డిస్‌ప్లేలో పెడుతున్నారు. పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు.. అత్యంత అనువైన సమయం చూసి దాడికి దిగారు. రెండు బైక్‌లపై (బ్లాక్ పల్సర్, వైట్ అపాచీ) ఐదుగురు వ్యక్తులు వచ్చారు. ముందుగా ఒకరు లోపలికి వచ్చి 20 గ్రాముల చైన్ కావాలని అడిగాడు. సిబ్బంది చూపిస్తున్న క్రమంలోనే మిగతా నలుగురు లోపలికి ప్రవేశించారు. కస్టమర్ల ముసుగులో వచ్చిన వారు క్షణాల్లో తుపాకులు బయటకు తీశారు. భయానక వాతావరణం సష్టించి, షట్టర్లు మూసేసి షోరూమ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.


ప్రాణాలకు తెగించిన సిబ్బంది..

నెత్తురోడిన షోరూమ్

లోపలికి రాగానే దొంగలు సిబ్బంది చేతులు వెనక్కి కట్టేసి లాకర్లు తెరవాలని బెదిరించారు. వాష్‌రూమ్‌లో భయంతో దాక్కున్న ఓ మహిళను సైతం బయటకు లాక్కొచ్చి నింపాదిగా నగలు బ్యాగుల్లో సర్దుకున్నారు. అయితే, ఈ క్రమంలో షోరూమ్ మేనేజర్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న దొంగలు విచక్షణారహితంగా 7 నుంచి 8 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు ఉద్యోగులు బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలారు. వీరిలో ఒకరి తలకు గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

పారిపోతూ గాలిలోకి ఫైరింగ్.. దొరికిన కీలక ఆధారాలు

నగలు దోచుకున్న అనంతరం దుండగులు బయటకు



పరుగులు తీశారు. అప్పుడు కూడా గాయాలతోనే సిబ్బంది వారిని వెంబడించగా, దొంగలు గాలిలోకి కాల్పులు జరుపుతూ బైక్‌లు స్టార్ట్ చేశారు. ఆ కంగారులో ఒక దొంగ కిందపడిపోగా, నగలున్న ఓ బ్యాగ్ కూడా అక్కడే పడిపోయింది. అంతేకాకుండా, వారి తుపాకీకి చెందిన మ్యాగజైన్, మూడు ఖాళీ బుల్లెట్ షెల్స్, ఒక కత్తి ఘటనా స్థలంలో పడిపోయాయి. వారు హిందీ, తెలుగు మాట్లాడుతున్నారని, ఉత్తరాదికి చెందిన అంతర్రాష్ట్ర ముఠాగా అనుమానిస్తున్నారు. వీరు సిరిసిల్ల వైపు పరారైనట్లు పోలీసులు గుర్తించారు.

పోలీసుల వేట ముమ్మరం.. నలుదిక్కులా నాకాబందీ

సమాచారం అందుకున్న వెంటనే ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మాస్కులు లేని నలుగురు నిందితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సరిహద్దులను దిగ్బంధించి హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలంలో దొరికిన మ్యాగజైన్, తూటాలు కంట్రీ మేడ్ వెపన్స్‌వా? లేక ఎక్కడైనా కొనుగోలు చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు నేతల భరోసా..

ఈ ఘటన జరిగిన సమయానికి సమీపంలోనే ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజరు కుమార్ వెంటనే షోరూమ్ వద్దకు చేరుకున్నారు. సిబ్బంది చూపిన తెగువను ప్రశంసించిన ఆయన, మెరుగైన వైద్యం కోసం బాధితులను హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, హుజూరాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తదితరులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు స్పందిస్తూ.. ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని, పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా, లేదా బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌లపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపించినా.. వెంటనే డయల్ 100 లేదా 8712670744, 8712670745 నంబర్లకు సమాచారం అందించాలని కరీంనగర్ పోలీసులు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు కుట్ర

మొదటి తరువాయి

జీవో నెంబర్ ఏడును తెచ్చిందని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ ఆదివారం లేఖ రాశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ అని తెలంగాణ సమాజానికి అర్థమైపోయిందని పేర్కొన్నారు. ఈ జీఓ వచ్చిన క్షణం నుంచి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖను విధ్వంసం చేసేందుకే ఆ శాఖను పర్యవేక్షిస్తున్నారా?అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కేసీఆర్ స్కీంలనే కాకుండా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలనూ పాతరేస్తారా?అని అడిగారు. ఓవైపు గురుకులాలను దెబ్బతీసి ఉన్నత విద్యకూ ఉరివేస్తారా?అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దుర్మార్గమైన జీవో నెంబర్ ఏడును వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేద విద్యార్థులతో దండుకట్టి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో దగాపడ్డ విద్యార్థులు గర్జిస్తే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు

# ఢిల్లీలో ఘోరం

మొదటి తరువాయి

సృష్టించినట్లు అధికారులు వెల్లడించారు. ఆదివారం భక్తుల రద్దీ మరింత పెరగడంతో సర్వదర్శనం కోసం వేచి ఉండే భక్తుల క్యూలు ఏటీజీహెచ్ ప్రాంతం వరకు కొనసాగుతున్నది.దర్శన టోకెన్లు లేని సామాన్య భక్తులకు శ్రీవారిని దర్శించుకునేందుకు సుమారు 16 గంటలపైగా సమయం పడుతున్నది. సెలవులు ముగిసే వరకు భారీ రద్దీ కొనసాగే అవకాశం ఉన్నందున, టీటీడీ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. భక్తులు రద్దీ దృష్ట్యా తమ ప్రయాణాలు సాగించాలని టీటీడీ కోరింది. సెలవుల కారణంగా భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరు గు తున్నదని, సెలవుల అనంతరం సా ధారణ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది.



# సంపాదకీయం

## ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !



తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్లు అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయారు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనే పరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమిషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ధి పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

-పట్టించుకోని మున్సిపల్ అధికారులు.
-తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ఉండలేమంటూ స్థానికుల ఆవేదన.



**హైదరాబాద్, కూకట్పల్లి, మే 03 :(మహాప్రభ)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షంషీగూడ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ మజీద్ గల్లి లైన్ బ్లాక్ నెంబర్ 143 నివాస గృహాల మధ్య తీవ్రమైన దుర్గంధంతో ఇళ్లలో ముక్కుమూసుకొని ఉండాల్సిన దుస్థితి నెలకొందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. గత మూడు నెలలకు పైగా ఎల్లమ్మ బండ పరిసరాల్లో డ్రైనేజీ లీకేజీలు నిరంతరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే వార్డు, మున్సిపల్ కార్యాలయంలో ఒకటికి, రెండుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం, సిబ్బంది నిర్వాకం శాపంగా మారిందని ఆ డివిజన్ ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. రోడ్లపై చెత్తంతా నెలల తరబడి పేరుకపోవడంతో గాలి వీచిన సమయంలో తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోందని, అప్పుడు ఇళ్లలో శ్వాస తీసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.మురికి నీరు కాలనీలో రోడ్లపైనే పొంగి పొర్లుతూ ఉండటం వలన దోమలు, పందులు,స్వైర విహారం చేయడం వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ దుర్గంధం కారణంగా చిన్నారులు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారని తీవ్రమైన ఆవేదన వ్యకం చేస్తున్నారు. చుట్టు పక్కల వారు సైతం రాత్రి వేళల్లో వచ్చి ఇక్కడి చెత్తను పడేసి వెళ్తున్నారని వాపోతున్నారు.ఈదురు గాలులకు చెత్తంతా ఇళ్లలోకి వస్తుండటం మరింత ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొంటున్నారు. మున్సిపల్ సంబంధిత పారిశుధ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఈ ప్రధాన సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక్కడ సరైన డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ లేకపోవడం, తరచుగా డ్రైనేజీ లీకేజీలు, పూడిక తీయకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. స్థానిక ప్రజలు జిహెచ్‌ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదని, వెంటనే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.మున్సిపల్ అధికారలు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# రెడ్ క్రాస్ మెంబర్షిప్ డ్రైవును విజయవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అవగాహన కార్యక్రమం
-నెలరోజుల పాటు కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్.

**రామాయంపేట మే 3 మహాప్రభ** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ చైర్మన్ దాన కిషోర్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో సభ్యత్వ నమోదు భార్య పెంచడమే లక్ష్యంగా మెంబర్షిప్ చేపట్టను ఇండియన్ రేట్ ప్రాసెస్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఏలేటి రాజశేఖర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోస్. జిల్లా కోశాధికారి డి.జి. శ్రీనివాస శర్మ ఆదివారం ఒక ప్రకటన లో వెల్లడించారు మే 1 నుండి 31 వరకు నిర్వహించే ఈ డ్రైవ్ కోసం కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక నోడల్ ఆఫీసర్ ను కలెక్టర్ నియమించినట్లు తెలిపారు ప్రజావాణిలో అవగాహన కార్యక్రమం శుక్రవారం శనివారం రెడ్ క్రాస్ కార్యవర్గంతో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో జిల్లాలోని ప్రస్తుత సభ్యుల జాబితా రాబోయే ప్రణాళికలపై చర్చించినట్లు వివరించారు ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే వివిధ శాఖల అధికారులకు సేవా కార్యక్రమాలపై చర్చిల ద్వారా అవగాహన కల్పించనున్నారు ఇందులో అన్ని శాఖలఅధికారులను భాగస్వామ్యం చేసి నిర్దేశించిన లక్ష్యం దిశగా సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తామని తెలిపారు సోమవారం ఉదయం ప్రజావాణిలో జరిగే ఈ మెంబర్షిప్ డ్రైవ్ లో రెడ్ క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు ఇతర వాలంటీర్లు పాల్గొనాలని కోరారు కలెక్టర్ ఆదేశాల ప్రకారం సభ్యులందరూ తప్పనిసరిగా రెడ్ క్రాస్ ఆప్రాన్. జాకెట్లు . ధరించి రావాలని కోరారు మానవత దృక్పథంతో చేసే ఈ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మెదక్ జిల్లాను రాష్ట్రంలోని ముందు ఉంచాలన్నారు.

# ఘనంగా కలశ యాత్ర

వైభవంగా శివభక్త మార్కండేయునికి లక్ష పుష్పార్చన
-ప్రత్యేక పాలాభిషేకం





**గాంధారి, మే 3 (మహా ప్రభ)** భక్తి ప్రేమతో ముక్తి పొందాలని బస్వాలింగ, రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. గాంధారి మండల కేంద్రంలోని ఆదివారం శివభక్త మార్కండేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షకోత్సవం పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామికి లక్ష పుష్పార్చన, శివలింగం 365 లీటర్ల గోక్షీరాభిషేకము, ఏకాదశ రుద్రాభిషేకం, మహా మంగళ హారతి, మంత్ర పుష్పము, శివ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకముందు మహిళా భక్తులు సంఘ భవనం నుంచి కలశాలను నెత్తిన బెట్టుకొని పాదయాత్రగా 2కిలోమీటర్ల మేర మార్కండేయ మందిరం వరకు శోభాయాత్ర చేపట్టారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గం సభ్యులు బండి రాజులు, మండల అధ్యక్షులు గుంటుకు అశోక్, పట్టణ అధ్యక్షులు క్యాతం కృష్ణ, ఉపాధ్యాక్షులు సామల రాజు, కార్యదర్శి సామల విజయ్, కోశాధికారి తాటిపాముల శివ, సంఘ సభ్యులు ప్రభు, మహేష్, శేఖర్, నారాయణ, సాయిలు, నర్సింలు, తలకొక్కుల నవీన్, తదితరులు పాల్గొన్నారు. భక్తులు ప్రేమికులు వర్షం వ్యక్తం చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్




**దేవరకొండ మే 03 ( మహా ప్రభ)** నియోజక వర్గం లోని చందంపేట మండలం పోలేపల్లి ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో నాగిళ్ల పెద్దులు-సుగుణమ్మ కుమారుడు నాగిళ్ల శివకుమార్-లక్ష్మమ్మ ల వివాహ వేడుకలలో మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు టివి ఎన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్,సర్పంచ్ నోముల శ్రీనయ్య,అందుగుల సైదులు, నాగిళ్ల మల్లేష్,కావటి నరసింహ నాగిళ్ల విజయ్ నాగిళ్ల రవి,సల్వాది పెద్దులు, నాగిళ్ల రాఘవేందర్,నోముల సాయిలు, కొమ్ము సైదులు, భాస్కర్, నాగరాజు, జనార్ధన్, ప్రేమ్ సాగర్, శివ,లవ కుమార్, మధు,తదితరులు పాల్గొన్నారు

## ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి తండ్రి దివంగత

# బొడ్డు రాజలింగం దశదిన కర్మ...

-హాజరైన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**శివ్వంపేట,మే 3 (మహాప్రభ).** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి తండ్రి దివంగత బొడ్డు రాజలింగం గత పది రోజులు క్రితం అనారోగ్య కారణాల దృశ్య మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. ఇదిలా ఉండగా ఆదివారం నాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవి కుటుంబంలో బొడ్డు రాజలింగం దశదిన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, పలువురు ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు,పలువురు బంధుమిత్రులు,వివిధ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టులు,హాజరై ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రవి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది.ఈ సందర్భంగా రవి కుటుంబ సభ్యులకు హాజరైన వారందరూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేయడం జరిగింది.దశదిన కార్యక్రమానికి కార్యక్రమానికి హాజరైన వారిలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వై.రమణ గౌడ్,జిల్లా గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ దొంతి చంద్ర గౌడ్,జెడ్పి మాజీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, రాష్ట్ర రవాణా శాఖ కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు,శివ్వంపేట ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఇసుగారి మల్లేష్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు నటరాజ్ గౌడ్, సర్పంచులు బ్యాగరి నరసయ్య,ఉప సర్పంచ్ కొత్తపేట వెంకటేశం గౌడ్,టిక్క దేవమ్మ గూడెం సర్పంచ్ లకావత్ తేజస్విని-రాజేందర్ నాయక్,పిఎసిఎస్ డైరెక్టర్ కొత్తపేట యాద గౌడ్, శ్రీశైలం యాదవ్, జర్నలిస్టులు గుండ్లపల్లి రవి, శ్రీనివాస్ రెడ్డి, కొండ సంపత్ కుమార్ తదితరులు తదితరులు ఉన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



**మర్రిగూడ, మే 3 (మహాప్రభ).** మర్రిగూడ మండల కేంద్రంలోని రాంరెడ్డి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుత్ ప్రమాదం సంభవించింది.చండూరు మాల్ ప్రధాన రహదారి పక్కన రైతు అబ్బనగోని వెంకటయ్య వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటల్లో చిక్కుకొని దగ్ధమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

# ధర్మసాగర్‌లో యతిన్ ట్రస్ట్ మెగా హెల్త్ క్యాంప్

**-- గ్రామీణులకు ఉచిత వైద్య సేవలు**
**- బీపీ, షుగర్ పరీక్షలు అవసరమైన వారికి ఉచిత మందులు, పెద్ద చికిత్సలకు ఆర్థిక సహాయం**






**కౌడిపల్లి మే 3 (మహాప్రభ):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కౌడిపల్లి మండలం ధర్మసాగర్ గ్రామంలో యతిన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు మేఘావత్ రవి మాట్లాడుతూ, పల్లె ప్రజల జీవితాలకు చేయూతనివ్వడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో ఈ క్యాంపులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు అనేక గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించి, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచిత మందులు అందజేస్తున్నామని వివరించారు. అలాగే పెద్ద వ్యాధులతో బాధపడుతున్న పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స ఖర్చులో 5 నుంచి 50 శాతం వరకు ఆర్థిక సహాయం అందించేందుకు ట్రస్ట్ సిద్ధంగా ఉందన్నారు. ధర్మసాగర్ సర్పంచ్ శివానంద రెడ్డి మాట్లాడుతూ, మెఘావత్ రవి వంటి యువకులు గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం గొప్ప సంకల్పమని పేర్కొన్నారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ హెల్త్ క్యాంప్‌లో సర్పంచ్ శివానంద రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్ గౌడ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, దిలీప్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఇస్నూర్ నందిని, మౌనిక, ప్రసాద్‌తో పాటు వైద్యులు అష్రఫ్, శివరాం, తైసీన్, మహిక్ పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అదనంగా, యతిన్ ట్రస్ట్ భవిష్యత్తులో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టి, డిగ్రీ మరియు బీటెక్ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ప్రపంచ స్థాయి వైద్య సేవల లక్ష్యంతో సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ ప్రారంభం.





**ఎల్‌బినగర్ -3 మే (మహాప్రభ)** కామినేని హాస్పిటల్ రోడ్, ఆర్టీసీ కాలనీలో నూతనంగా ప్రారంభమైన సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ వైద్య సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ హాజరై సంస్థను ప్రారంభించారు. ప్రపంచ స్థాయి యూరాలజీ మరియు నెఫ్రాలజీ వైద్య సేవలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా యూరాలజీ మరియు కిడ్నీ సంబంధిత చికిత్సలు ఒకే వేదికపై అందించబడటం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వైద్య రంగంలో ఇటువంటి ప్రత్యేక సంస్థలు స్థాపించబడటం సమాజ ఆరోగ్యాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. సంస్థ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, ప్రజలు, అలాగే బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ రమేష్ చారి , తిరుమల , వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొని నూతన ఆసుపత్రి సేవలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# వైశ్య భవన్‌లో భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు





**కరీంనగర్, మే3( మహా ప్రభ )** కరీంనగర్‌లోని వైశ్యభవన్‌లో వేసవి సెలవులను పురస్కరించుకుని 8 నుండి 15 సంవత్సరాల బాలబాలికలకు భగవద్గీత ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వైశ్యభవన్ అధ్యక్షుడు చిదురు సురేష్, పాలకవర్గం ఆధ్వర్యంలో అల్లాడి రాధిక ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.దైవభక్తి పెంపొందించడంతో పాటు క్రమశిక్షణతో ఎదగడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు, రామకోటి పుస్తకాలు, పెన్నులు ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో వైశ్య సేవకేంద్రం కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, కోశాధికారి ముస్త్యాల రమేష్, డైరెక్టర్లు నలుమాచు చంద్రశేఖర్, కైలాస నవీన్, గీతభక్త సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, ఉప్పల రామేశం, బండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. భగవద్గీత శిక్షణ తరగతులు యువతలో ఆధ్యాత్మికత, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించబడుతున్నాయి.

# ప్రశాంతంగా ముగిసిన నీట్-2026 పరీక్ష



**సిద్ధిపేట, మే3( మహా ప్రభ )** జిల్లాలో నీట్-2026 ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడిందని కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది.జిల్లాలో మొత్తం 937 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 916 మంది హాజరయ్యారు. 21 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ స్వయంగా పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు ప్రణాళికతో పరీక్షను విజయవంతంగా నిర్వహించామని, రెండు కేంద్రాల్లో ఆర్డీఓ నేతృత్వంలో పగడ్బందీగా పోలీసు భద్రత ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని తెలిపారు. పరీక్ష నిర్వహణలో అధికారులు సమన్వయంతో కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు.సిద్ధిపేట జిల్లాలో నీట్-2026 పరీక్ష ఎలాంటి అంతరాయం లేకుండా విజయవంతంగా ముగిసింది.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి



**హుస్నాబాద్, మే3( మహా ప్రభ )** కోహెడ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలోని మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన వడ్లు, మక్కజొన్నలు ఆదివారం కురిసిన అకాల వర్షాలతో తడవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ పరిస్థితిని పరిశీలించడానికి రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు మార్కెట్ యార్డును సందర్శించారు.తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆలస్యం చేస్తే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునే చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్శనలో పలువురు రైతులు పాల్గొని తమ సమస్యలను వివరించారు.అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని కోరారు.

# బిక్షపతి ని పరామర్శించిన కౌన్సిలర్ పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, మే3( మహా ప్రభ )** ఆమనగల్లు పట్టణానికి చెందిన నాయి బ్రాహ్మణ సేవ సంఘం నాయకులు బిక్షపతి గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము శనివారం బిక్షపతి ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటా అధైర్య పడొద్దు భరోసా కల్పించారు. తనవంతు సహాయంగా 10 వేల రూపాయలు అందజేశారు. ఆయన వెంట శ్రీను నాయక్, సైదులు గౌడ్ ఉన్నారు.

# సత్యవేడు లో టీటీడీ కల్యాణ మండపం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**-సత్యవేడు గంగ జాతరకు రూ.10 వేలు విరాళం**



**మే 3 తిరుపతి జిల్లా (సత్యవేడు) మహాప్రభ ప్రతినిధి** సత్యవేడులో నిర్మిస్తున్న టిటిడి కళ్యాణ మండపం పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే సత్యవేడు చేరుకొని టిటిడి కళ్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అక్కడే ఉన్న కాంట్రాక్టర్ విక్రమ్ కు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. అనంతరం సత్యవేడు గంగ జాతరకు ఆహ్వానం నిమిత్తం వచ్చిన జాతర కమిటీకి రూ.10 వేలు నగదను ఎమ్మెల్యే విరాళంగా అందించారు. మదనంబేడు గ్రామానికి చెందిన రిపోర్టర్ రామచంద్రయ్య కుమారుని వివాహం నేడు జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే వారి స్వగృహానికి చేరుకుని వధూవరులను ఆశీర్వదించి, రామచంద్రయ్య కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుండి నాగలాపురం చేరుకొని పలు ప్రైవేటు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, సత్యవేడు గంగ జాతర కమిటీ అధ్యక్షులు గోపి రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి...



**పాపన్నపేట మే3( మహా ప్రభ )** మద్యానికి బానిసై మనస్థాపంతో క్రిమిసంహారక మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్ పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...గ్రామానికి చెందిన శ్రీరాం సాయిలు(48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.కొన్ని రోజుల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి మద్యానికి బానిసగా మారాడు.రెండు రోజుల క్రితం చుట్టాల ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.ఆదివారం తన వ్యవసాయ పొలంలో క్రిమిసంహారక మందు సేవించి వాంతులు చేసుకుంటూ కింద పడి ఉండగా అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు.కుటుంబీకులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు అక్కడ డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు చెప్పారు.మృతుడి కొడుకు సాయిరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# పేదల కల ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ తోనే సాధ్యం



**హుస్నాబాద్, మే3( మహా ప్రభ )** అక్కంపేట మండలంలోని కేశ నాయక్ తండా గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పేదలకు సొంత ఇల్లు కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అనేక ఇండ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.లబ్ధిదారులు ఇల్లు పూర్తయి గృహప్రవేశం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.గ్రామ సర్పంచ్ సులోచన, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# అడ్వకేట్ నాజియా కుదిజకు లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వం




**కరీంనగర్,మే3( మహా ప్రభ )** అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 137-వా ఆధ్వర్యంలో ప్రముఖ అడ్వకేట్ నాజియా కుదిజ రూ.11,000 చెల్లించి ప్రతిష్టాత్మక లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వాన్ని పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నిరుపేదలకు, నిరాశ్రయులకు దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేయడం, టవర్ సర్కిల్‌లో మినరల్ వాటర్ సదుపాయం కల్పించడం వంటి సేవా కార్యక్రమాలతో నాజియా కుదిజ ఎనలేని సేవలు అందించారని ఆయన కొనియాడారు. 30 దేశాల్లో విస్తరించిన అలయన్స్ క్లబ్‌లో లైఫ్ మెంబర్‌షిప్ విధానం ప్రత్యేకమని, విదేశీ స్వచ్ఛంద సంస్థల్లో ఇది లేనిదని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసుదేవ హాస్పిటల్ ప్రతినిధులు, డిస్ట్రిక్ట్ గవర్నర్ కొంజర్ల మహేష్, పండుగ నాగరాజు, అడ్వకేట్ అనూష రెడ్డి, సుద్దపల్లి ప్రసాద్, ముసుకుల సాగర్ రెడ్డి, కటుకూరి సుధాకర్, సోమవారపు వెంకన్న, పుల్లల శ్యామ్, మాటేటి శ్రీనివాస్, అల్లాడి ఆనంద్ కుమార్, ఇంజనీర్లు కోల అన్నారెడ్డి, కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వరరావు, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందిన అడ్వకేట్ నాజియా కుదిజకు లైఫ్ మెంబర్ ఫెలో సభ్యత్వం గర్వకారణమని డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ అభినందించారు.

# ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు

**-- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**కల్వకుర్తి, మే3( మహా ప్రభ )**
ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రజలకు, ముఖ్యంగా జర్నలిస్టులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ప్రాణాధారం అని, సమాజంలో సత్యాన్ని వెలికితీసే బాధ్యతను మీడియా నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. పత్రికలు, మీడియా సంస్థలు ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ పనితీరును సమీక్షిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేసే పాత్రలో మీడియా ఎంతో కీలకమని ఆయన అన్నారు. జర్నలిస్టులు వృత్తి నిబద్ధతను కాపాడుకుంటూ నిజాయితీగా పనిచేయాలని ఆకాంక్షించారు."మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో మీడియా పాత్ర మరింత బలోపేతం కావాలి" అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

# అగ్నికి ఆహుతి అయిన మొక్కజొన్న పంట



**నాగర్‌కర్నూలు, మే3( మహా ప్రభ )**
బిజినేపల్లి మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన రైతు డొక్కా శ్రీనివాసులు మొక్కజొన్న పంట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిరిన నిప్పురవ్వలతో అగ్నికి ఆహుతైంది.పొలంలో మంటలు వ్యాపించడంతో మొత్తం పంట బూడిదైపోయింది. చుట్టుపక్కల రైతులు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంట సాగు చేసిన రైతు శ్రీనివాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, "ఇప్పుడు ఈ నష్టాన్ని ఎలా భరించాలి?" అని వేదనతో తెలిపారు.గ్రామ ప్రజలు, రైతులు విద్యుత్ శాఖ అధికారులు రైతు బాధను అర్థం చేసుకుని తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆరోగ్యమే గొప్ప సంపద

**- కలెక్టర్ బి. చంద్రశేఖర్**




**నల్లగొండ, మే3( మహా ప్రభ )**
"మనిషికి ఆరోగ్యమే గొప్ప సంపద" అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు.సొసైటీ ఫర్ తెలంగాణ రన్ ఆధ్వర్యంలో, అవంతిక కన్స్ట్రక్షన్స్, ఆరోగ్య హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నల్గొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో 2కే, 5కే, 10కే రన్‌లు నిర్వహించారు. కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ లతో కలిసి ఈ రన్‌లను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "శారీరక, మానసిక దృఢత్వం కోసం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు ఇలాంటి రన్‌లు ఎంతో ఉపయోగపడతాయి. త్వరలో యోగా దినోత్సవం జరగనుంది. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యానికి మించిన గొప్ప సంపద మరొకటి లేదు" అని అన్నారు.ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ, "నల్గొండ జిల్లాలో ఆరోగ్యంపై ఇలాంటి రన్‌లు నిర్వహించడం సంతోషకరం. శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలి. రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా నల్గొండకు మంచి పేరు తీసుకురావాలి" అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ తెలంగాణ మగ్గారి శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ బండారు ప్రకాష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రమేష్, అనితా రాణి, డిఎస్పీ శివరామిరెడ్డితో పాటు అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సుమారు వెయ్యి మంది ఈ రన్‌లో పాల్గొని ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

# ఘనంగా ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







**హుస్నాబాద్/కరీంనగర్, మే3( మహా ప్రభ )**
అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో, కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి.హుస్నాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ యువతకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల సాధనకై ఏఐవైఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రభుత్వాలు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు.కరీంనగర్‌లో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ 1958లో ఆవిర్భవించిన ఏఐవైఎఫ్ నిరుద్యోగం, ప్రైవేటీకరణ, సామాజిక అసమానతలపై 67 సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని, యువతను మాదకద్రవ్యాల ఉచ్చులో పడకుండా చైతన్యపరచాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ రెండు కార్యక్రమాల్లో ఏఐవైఎఫ్ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి సాధనకై యువజన ఉద్యమాలను బలోపేతం చేయాలని ఏఐవైఎఫ్ నేతలు పిలుపునిచ్చారు.

# అభివృద్ధి పథంలో పోతేపల్లి

**- సర్పంచ్ కొండల్ యాదవ్**



**వెల్దండ, మే3( మహా ప్రభ )**
పోతేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన కర్తవ్యం అని సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ తెలిపారు. ప్రజల్లో మమేకమై సమస్యలను పరిష్కరిస్తూ, సొంత నిధులతో గ్రామ అభివృద్ధి పనులు చేపడుతున్నానని ఆయన పేర్కొన్నారు.భారీ వర్షాల సమయంలో డ్రైనేజ్ పనులు వేగవంతంగా పూర్తి చేయించానని, వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కొత్త మోటార్ ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీరు అందజేశానని వివరించారు. గ్రామ ప్రజలు కోరగానే సమస్యలు పరిష్కరించిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**గంగాధర, మే3( మహా ప్రభ )**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని మోతే గ్రామంలో సర్పంచ్, పాలకవర్గం ఆహ్వానం మేరకు నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దేవుడు వెంకటేశ్వర స్వామి కళ్యాణంలో పాల్గొనడం ఎన్నో జన్మల పుణ్యఫలమని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని దేవుని ప్రార్థించానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోతే గ్రామ సర్పంచ్ బత్తిని భవాని, ఉపసర్పంచ్ అనిల్, సుధాగోని మహేష్ గౌడ్, అంబటి శ్రీను, నర్సింగరావు, మామిడిపల్లి చెతన్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.వైభవంగా జరిగిన కళ్యాణోత్సవంలో గ్రామ ప్రజలు, నేతలు పాల్గొని భక్తి భావంతో స్వామి ఆశీర్వాదం పొందారు.

# ఇందుర్తి రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**హుస్నాబాద్, మే3( మహా ప్రభ )**
చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్, ప్రణీత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్న దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు శాలువాతో సన్మానించి ఘనంగా స్వాగతించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్, ఉపసర్పంచ్ అనిల్, లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్ రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, గౌడ్ సంఘం నాయకులు గట్టు రమేష్, బుర్ర స్వామి, ఆకుల శ్రీను, గట్టు మొగిలి, బుర్ర పరశురాములు, బత్తిని శ్రీనివాస్, రేణుక కార్యదర్శి సుమంత్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొని, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పేదల కల ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ తోనే సాధ్యం



**హుస్నాబాద్, మే3( మహా ప్రభ )**
అక్కంపేట మండలంలోని కేశ నాయక్ తండా గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు పేదలకు సొంత ఇల్లు కలను కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో అనేక ఇండ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.లబ్ధిదారులు ఇల్లు పూర్తయి గృహప్రవేశం చేసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.గ్రామ సర్పంచ్ సులోచన, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షునిగా చెట్టిమల్ల ప్రశాంత్

### ఏకగ్రీవంగా ఎన్నిక - నూతన కమిటీకి శుభాకాంక్షల వెల్లువ



**చింతపల్లి, మే3( మహా ప్రభ )**
అంబేద్కర్ యువజన సంఘం చింతపల్లి మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించగా, సంఘ మండల అధ్యక్షునిగా చెట్టిమల్ల ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా బండి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా నల్లవెల్లి సైదులు, సహాయ కార్యదర్శిగా పంబలి యాదగిరిని ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా గాధరి జంగయ్య, నల్లవెల్లి యాదయ్య, నల్లవెల్లి సదానందం నియమితులయ్యారు. గౌరవ సలహాదారులుగా నల్లవెల్లి ప్రభాకర్, నల్లవెల్లి రామకృష్ణ, నల్లవెల్లి సైదులు, సలహా సభ్యులుగా బండి లక్ష్మీకాంత్, ఆనంద్ కుమార్, నల్లవెల్లి యాదగిరి నియమితులయ్యారు. అడ్వైజరీ కమిటీ సభ్యులుగా గంటల ఆంజనేయులు, ఆవుల మల్లయ్య, పంబలి వెంకటయ్య, కార్యనిర్వాహక ఫౌండర్ సభ్యునిగా నల్లవెల్లి సంజీవ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చెట్టిమల్ల ప్రశాంత్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికలో సహకరించిన సంఘ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిజినెస్

## డీమార్ట్‌కు కళ్లుచెదిరే లాభాలు..

**3 నెలల్లో రూ. 17 వేల కోట్ల ఆదాయం.. మొత్తం స్టోర్లు ఎన్ని ఉన్నాయో తెలుసా?**




దేశవ్యాప్తంగా డీమార్ట్ పేరిట స్టోర్లను నిర్వహిస్తున్న ఇండియన్ సూపర్‌మార్కెట్ చెయిన్ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4) ఫలితాల్ని ప్రకటించింది. శనివారం రోజు (మే 2) సాయంత్రం సంస్థ వెల్లడించిన ఫలితాల్లో అదరగొట్టడం విశేషం. సంస్థ నికర లాభం సమీక్షా త్రైమాసికంలో రూ. 656.6 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే లాభం 19 శాతం పెరిగింది. అప్పుడు ఇదే సమయంలో లాభం రూ. 550.90 కోట్లుగా ఉంది.మరోవైపు కంపెనీ కార్యకలాపాల ఆదాయం క్యూ4లో రూ. 17,684 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఇదే సమయంలో సంస్థ ఆదాయం రూ. 14,872 కోట్లుగా ఉండగా.. ఇప్పుడు ఏకంగా 19 శాతం మేర పెరగడం విశేషం. ఈ మేరకు అవెన్యూ సూపర్‌మార్ట్స్ తాజాగా రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వివరాల్ని వెల్లడించింది.

**500 కు చేరిన డీమార్ట్ స్టోర్లు..**

ఇక కంపెనీ ఎబిటా కూడా పెరిగింది. వార్షిక ప్రాతిపదికన ఇది 26.7 శాతం పెరిగి రూ. 1210.5 కోట్లకు చేరుకుంది. అంతకుముందు ఇదే సమయంలో ఎబిటా రూ. 955.1 కోట్లుగా ఉండేది. దేశవ్యాప్తంగా అవెన్యూ సూపర్‌మార్ట్స్.. తన ఉనికిని చాటుకుంటూ మరింత విస్తరించే ప్రయత్నం చేస్తోంది. దీనిని చాటేలా చివరి త్రైమాసికంలో 58 కొత్త స్టోర్లను తెరిచింది. ఈ క్రమంలోనే మొత్తం డీమార్ట్ స్టోర్ల సంఖ్య దేశవ్యాప్తంగా 500 మార్కును చేరుకుంది. మార్చి 2026లో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో.. కొనుగోళ్లదారుల సెంటిమెంట్ బలపడిందని దీంతో కొనుగోళ్లు పెరిగాయని పేర్కొంది. నెల చివరికి వచ్చే సరికి పరిస్థితులు సాధారణంగా మారాయని తెలిపింది. యుద్ధం కారణంగా ఇప్పటివరకు సప్లై చెయిన్‌లో తమ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదని స్పష్టం చేసింది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి చూస్తే డీమార్ట్ మొత్తం ఆదాయం వార్షికంగా 15.9 శాతం పెరిగి రూ. 66,968 కోట్లకు చేరుకుంది. ఎబిటా 15.7 శాతం పెరిగి రూ. 5,255 కోట్లుగా నమోదైంది. ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ (ప్యాట్) 10.1 శాతం పెరిగి రూ. 3,224 కోట్లుగా ఉంది.

## హైదరాబాద్, విజయవాడలో తులం ధర ఎంతుందంటే..?

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. .ఆ తర్వాత క్రమంగా దిగివస్తున్నాయి.. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధంతో బంగారం, వెండి ధరలు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయి. అయితే.. ఇటీవల ధరలు తగ్గుతూ వస్తున్నాయి. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. ఆదివారం (మే 3, 2026 ) ఉదయం ఆరు గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి..

24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,50,930గా ఉంది.

22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,38,350 గా ఉంది.

వెండి కిలో ధర రూ.2,65,000 లు గా ఉంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.



**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,50,930, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,38,350 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,50,930, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,38,350 ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

-ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,51,230, 22 క్యారెట్ల ధర రూ.1,38,500 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,65,000 ఉంది.

-ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,50,930, 22 క్యారెట్ల ధర రూ.1,38,350 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,65,000 లుగా ఉంది.

-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,52,730, 22 క్యారెట్ల ధర రూ.1,40,000 ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,50,930, 22 క్యారెట్ల ధర రూ.1,38,350 ఉంది. వెండి కిలో ధర రూ.2,65,000 లుగా ఉంది.

## కోటక్ మహీంద్రా బ్యాంక్ ఆశాజనకం

ముంబై, మే

ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.5,423 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది.అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,933 కోట్ల లాభంతో పోలిస్తే 10 శాతం వృద్ధిని కనబరిచింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 8 శాతం ఎగబాకి రూ.7,876 కోట్లకు చేరుకున్నది. మార్చి31తో ముగిసిన ఏడాదికాలానికిగాను బ్యాంక్ అడ్వాన్స్‌లు 16 శాతం, డిపాజిట్లు 15 శాతం చొప్పున పెరిగాయి.

kotak

## అపర కుబేరుడి చేతికి రాజస్థాన్ రాయల్స్..

### రూ.15 వేల కోట్లకు కొనేశాడు..!



ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ మరోసారి చేతులు మారింది. పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందు జైపూర్‌కు చెందిన ఈ ఫ్రాంచైజీని కల్ సొమాని గ్రూప్ కొనుగోలు చేయగా.. ఇప్పుడు బ్రిటన్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు లక్ష్మి మిట్టల్ భారీ ధరకు దక్కించుకున్నాడు. 1.65 బిలియన్ డాలర్లకు (భారతీయ కరెన్సీలో రూ.15,660 కోట్లు) రాజస్థాన్ జట్టును ఈ వ్యాపార దిగ్గజం సొంతం చేసుకున్నాడు.ఐపీఎల్ మధ్యలోనే రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త బాస్ చేతుల్లోకి వెళ్లింది. స్టీల్ వ్యాపారంలో దిగ్గజం లక్ష్మి మిట్టల్ కుటుంబం భారీ ధరకు రాజస్థాన్ యాజమాన్యం హక్కులు సాధించింది. ఫ్రాంచైజీలో 75 శాతం వాటా మిట్టల్ కుటుంబానిది కాగా.. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అడార్ పూనావాలా, మనోజ్ బడాలేలు సహ యజమానులుగా కొనసాగనున్నారు.ఐపీఎల్ ఆరంభ సీజన్ జట్లలో ఒకటైన రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేయడానికి కుటుంబ నేపథ్యమూ ఓ కారణమని లక్ష్మి మిట్టల్ తెలిపాడు. మాది రాజస్థాన్ కుటుంబం. అందుకే రాజస్థాన్ రాయల్స్‌ను కొనుగోలు చేశా. స్కూల్లో నేను క్రికెట్ ఆడాను. అప్పటి నుంచి నాకు క్రీడలంటే చాలా ఇష్టం. ఎందరో గొప్ప ఆటగాళ్లు రాజస్థాన్ జెర్సీని ధరించారు. యువతకు స్ఫూర్తిగా నిలిచిన భారత దిగ్గజాలూ రాజస్థాన్‌కు ఆడారు. సో.. నేను ఈ గొప్ప జట్టులో భాగం కావాలనుకున్నా. స్టేడియంలో మ్యాచ్ చూస్తూ అభిమానులతో కలిసి రాజస్థాన్ విజయాన్ని కాంక్షించేందుకు ఆతృతగా ఎదురు చూస్తున్నా అని లక్ష్మి మిట్టల్ ఒక ప్రకటనలో వెల్లడించారు.పంతొమ్మిదో సీజన్‌కు ముందే రాజస్థాన్ ఫ్రాంచైజీ వేలంలో భారీ ధర పలికింది. బ్రిటన్‌కు చెందిన కల్ సొమనీ నాయకత్వంలోని సంఘం.. రాబ్ వాల్టన్(వాల్‌మార్ట్), ది హంప్ (ఫోర్డ్) కుటుంబాలు రాజస్థాన్ జట్టును హస్తగతం చేసుకున్నాయి. అయితే.. సీజన్ మధ్యలోనే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ లక్ష్మి మిట్టల్ కుటుంబం అత్యధిక వాటాను కొనుగోలు చేసింది. 75 శాతం వాటాలో మిట్టల్ ఫ్యామిలీ ఫ్రాంచైజీలో పెద్దన్నలా వ్యవహరించనుంది. అడార్ పునావాలా 18 శాతం, మిగిలిన ఏడు శాతం వాటా మనోజ్ బడలే పేరున ఉంది.

# స్పోర్ట్స్

## చెన్నై వెంటాడుతున్న దురదృష్టం..

### అరంగేట్రం మ్యాచ్‌తో ఆటకు దూరమైన పేసర్..!




పంతొమ్మిదో సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ను దురదృష్టం గాయాల రూపంలో వెంటాడుతోంది. సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా ఒక్కొక్కరు టోర్నీకి దూరమవుతున్నారు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ ఆడి ఐపీఎల్ అరంగేట్రం చేసిన ఆల్‌రౌండర్ రామకృష్ణ ఘోష్ (=ఖుఖునెతీఅంష్ట్రఖు +ష్టశీంష్ట్ర) అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించాడు. శనివారం చెపాక్‌లో ఫీల్డింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకున్న ఈ కుర్రాడు గాయం కారణం మిగతా మ్యాచ్‌లకు దూరమయ్యాడు.అరంగేట్రం మ్యాచ్‌లోనే అదరగొట్టిన రామకృష్ణ ఘోష్ పాదం గాయంతో ఐపీఎల్ నుంచి వైదొలిగాడు. దాంతో, పంతొమ్మిదో సీజన్‌లో సత్తా చాటాలనుకున్న అతడికి చుక్కెదురైంది. రామకృష్ణ సీజన్‌కు దూరమయ్యాడని ఆదివారం హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ తెలిపాడు.'రామకృష్ణ ఇటీవల గొప్పగా మెరుగయ్యాడు. అకాడమీలో అతడు చాలా కష్టపడుతున్నాడు. అతడు మంచి ఆల్‌రౌండర్. అయితే.. దురదృష్టవశాత్తూ అతడు టోర్నీకి దూరమయ్యాడు. అతడు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నాం' అని ఫ్లెమింగ్ పేర్కొన్నాడు. ఇంతకూ రామకృష్ణ మ్యాచ్‌లో ఎలా గాయపడ్డాడు? అనేది తెలియాల్సి ఉంది.

**గాయంతో.. వీళ్లు దూరం**

అసలే బ్యాటింగ్.. బౌలింగ్ తడబాటు నుంచి తేరుకుని గెలుప తోవ తొక్కిన చెన్నై సూపర్ కింగ్స్‌ను గాయాలు వదలడం లేదు. గాయం నుంచి కోలుకుంటున్న మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఇప్పటివరకూ ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇక పేసర్ నాథన్ ఎల్లిస్ ఆరంభానికి ముందే వైదొలలిగాడు.సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ టోర్నీ మధ్యలో గాయపడగా.. కుర్రాడు ఆయుశ్ మాత్రే కండరాల చీలకతో సీజన్ మొత్తానికి దూరమయ్యారు. ఇప్పుడు రామకృష్ణ సైతం అదే కారణంతో తదుపరి మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారు? అనేది రెండు మూడు రోజుల్లో తెలియనుంది.

## సూర్యతోపాటు శ్రేయాస్ అయ్యర్‌కు షాకిచ్చిన గంభీర్..

### లైన్‌లోకి కోహ్లీ బెస్ట్ ఫ్రెండ్..?




భారత క్రికెట్ జట్టులో మిస్టర్ 360 ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సూర్యకుమార్ యాదవ్ కెరీర్ ఇప్పుడు సందిగ్ధంలో పడింది. ఒకప్పుడు మ్యాచ్ విన్నర్‌గా పేరు తెచ్చుకున్న సూర్య, ఇటీవల కాలంలో ప్రభావం చూపడంలో విఫలమవుతున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన కెప్టెన్ అయినప్పటికీ, వ్యక్తిగత ప్రదర్శన విషయంలో సూర్య గ్రాఫ్ పడిపోతూ వస్తోంది. ముఖ్యంగా స్ట్రైక్ రేట్ తగ్గడం, కీలక సమయాల్లో వికెట్ పారేసుకోవడం సెలెక్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ 2026 సీజన్ సూర్యకు ఏమాత్రం కలిసి రావడం లేదు. ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్న అతను వరుసగా 21, 5, 36, 15, 0 వంటి స్కోర్లతో నిరాశపరిచాడు. గత పది ఐపీఎల్ ఇన్నింగ్స్‌లలో కేవలం ఒకే ఒక్క అర్ధ సెంచరీ నమోదు చేయడం అతని ఫామ్ లేమికి అద్దం పడుతోంది. జాతీయ జట్టులో చోటు నిలబెట్టుకోవాలంటే ఐపీఎల్ ప్రదర్శన కీలకం కావడంతో, సూర్యపై వేటు పడటం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ టైటిల్ నెగ్గడంలో సూర్య నాయకత్వం బాగున్నప్పటికీ, బ్యాటర్‌గా అతను ఆశించిన స్థాయిలో రాణించలేదు. టోర్నీ మొత్తంలో 9 మ్యాచ్‌ల్లో 242 పరుగులు చేసినా, అందులో అమెరికాపై చేసిన 84 పరుగులే కీలకం. కానీ నాకౌట్ మ్యాచ్‌ల్లో సూర్య తడబడ్డాడు. ముఖ్యంగా న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో డకౌట్ అవ్వడం అతనిపై విమర్శలకు దారితీసింది. కెప్టెన్సీలో సక్సెస్ సాధించినా, బ్యాటింగ్‌లో నిలకడ లేకపోవడం పెద్ద మైనస్‌గా మారింది.సూర్యకు ప్రత్యామ్నాయంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ రజత్ పాటిదార్ పేరు బలంగా వినిపిస్తోంది. గతేడాది ఆర్‌సీబీకి తొలి ఐపీఎల్ టైటిల్ అందించడంలో కీలక పాత్ర పోషించిన పాటిదార్, ఈ సీజన్‌లోనూ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్ 2026లో అతని ఇటీవలి స్కోర్లు 19, 8, 27, 53, 63, 48 (నాటౌట్) చూస్తుంటే అతను ఎంత నిలకడగా ఆడుతున్నాడో అర్థమవుతుంది. ముఖ్యంగా 200 పైచిలుకు స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధిస్తుండటం విశేషం.శ్రేయాస్ అయ్యర్ తిరిగి జట్టులోకి వస్తాడని అందరూ భావించినా, పాటిదార్ చూపిస్తున్న దూకుడు అతడిని రేసులో ముందంజలో ఉంచింది. అటు బ్యాటింగ్‌తో పాటు ఆర్‌సీబీ కెప్టెన్‌గా కూడా పాటిదార్ రాణిస్తుండటం అతనికి కలిసొచ్చే అంశం. సూర్య స్థానంలో ఒక అగ్రెసివ్ బ్యాటర్ కావాలని భావిస్తే సెలెక్టర్ల మొదటి ఛాయిస్ రజత్ పాటిదార్ అయ్యే అవకాశం ఉంది. రాబోయే సిరీస్‌ల కోసం టీమ్ ఇండియా బ్యాటింగ్ లైన్ అప్‌లో భారీ మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.





# బాక్సాఫీస్ వద్ద 'రాజా శివాజీ' జోరు..

## రెండు రోజుల్లో రూ.26 కోట్లు!




బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ స్వీయ దర్శకత్వంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన చారిత్రక చిత్రం 'రాజా శివాజీ' బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతోంది. మొదటి రోజు రికార్డు స్థాయి వసూళ్లతో మరాఠీ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచిన ఈ చిత్రం, రెండో రోజు స్వల్ప తగ్గుదలని నమోదు చేసినప్పటికీ ప్రస్తుతం నిలకడగా రాణిస్తోంది. దీంతో ఈ చిత్రం రెండు రోజుల్లో కలిపి ప్రపంచవ్యాప్తంగా రూ. 26.06 కోట్లు నమోదు చేసింది. ఈ సినిమా మరాఠీ వెర్షన్ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుండగా. హిందీలో ఇప్పుడిప్పుడే రాణిస్తుంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో సంజయ్ దత్, అభిషేక్ బచ్చన్, రకుల్ ప్రీత్ సింగ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు. సల్మాన్ ఖాన్ అతిథి పాత్రలో మెరిశారు.రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం, మరాఠీలో అత్యధిక వసూళ్లు సాధించిన 'సైరాట్' రికార్డులను తిరగరాస్తుందని ట్రేడ్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సమ్మర్ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'రాజా శివాజీ' బాక్సాఫీస్ వద్ద లాంగ్ రన్ కొనసాగించేలా కనిపిస్తోంది.

# ఆ సీన్స్ ట్రిమ్ చేయండి ప్లీజ్?



చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఉపయోగం ఏముంటుంది?.. పాపం.. ఈ విషయం బాలీవుడ్ నటి కియారా అద్వానీకి అర్థం కావడంలేదు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక.. సరిదిద్దుకునేందుకు ప్రయత్నించడం నిష్ప్రయోజనం. ఇంతకీ చేతులు కాలేంత పని కియారా ఏం చేసింది? అనే వివరాల్లోకెళ్తే.. 'కేజీఎఫ్'ఫేం యష్ నటిస్తున్న పానిండియా యాక్షన్ థ్రిల్లర్ 'టాక్సిక్'లో కియారా అద్వానీ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తన కెరీర్‌లో ఇప్పటివరకూ గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్ ఎన్నో చేసింది కియారా. అయితే.. 'టాక్సిక్'లో మాత్రం మరింత బోల్డ్‌గా, ఇంటెన్స్ పాత్రను ఆమె పోషించింది.ఇందులో శృతి మించిన బోల్డ్ సీన్స్‌లో కూడా కియారా నటించినట్టు వినికిడి. ఆ సీన్స్ పూర్తిగా ఆమె అనుమతితోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించినా, ఫైనల్ అవుట్‌పుట్ చూసుకున్నాక, కియారా షాక్‌కి గురైందట.దాంతో ఆ బోల్డ్ సీన్స్‌ను ట్రిమ్ చేయాలంటూ దర్శకురాలిని కోరిందట. అయితే.. దర్శక,నిర్మాతలు అందుకు నిరాకరించినట్టు తెలిసింది. మరోవైపు.. ఇది కేవలం గాసిప్ మాత్రమేనని, సినిమాకు హైప్ తెచ్చేందుకే ఇలాంటి గాలివార్తలు సృష్టిస్తున్నారంటూ కూడా కథనాలు వెలువడుతున్నాయి. అసలు నిజమేంటో సినిమా విడుదలైతే కానీ తెలీదు. త్వరలోనే సినిమా విడుదల కానున్నది.



# గ్లామర్ పాత్రలకు బ్రేక్ ..
# శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కు ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించిన శ్రీలీల, "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనుకుంటున్నాను" అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపింది.శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడుతుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూపించాలని ఉన్న ఆమె తపనను అభిమానులు స్వాగతిస్తున్నారు.కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది.



# ఓటీటీలోకి అడివి శేష్ 'డెకాయిట్'..

## స్ట్రీమింగ్ ఎప్పుడంటే!

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ క్రేజీ యాక్షన్ చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో మే 8వ తేదీ నుండి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత నెల ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, అడివి శేష్ మార్క్ యాక్షన్ మరియు మృణాల్ ఠాకూర్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది.షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడిపోయిన ఇద్దరు ప్రేమికులు మళ్ళీ కలుసుకున్నప్పుడు వారి జీవితాల్లో ఎదురైన సవాళ్లు మరియు ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. ముఖ్యంగా బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఇందులో కీలక పాత్రలో నటించడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ మరియు మలయాళ భాషల్లో కూడా ఈ చిత్రం అందుబాటులోకి వస్తుండటంతో అటు శేష్ అభిమానులు, ఇటు ఓటీటీ ప్రియులు మే 8 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# గోపీచంద్ కొత్త సినిమా

హీరో గోపీచంద్ ప్రస్తుతం 'భరత వర్ష' అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మరో సినిమాను ప్రకటించారు. దీని ద్వారా ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. గోపీచంద్ 34వ సినిమా ఇది. 70ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారుశనివారం అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. మైథలాజికల్ అంశాలతో సాగే చిత్రమిదని, భారీ బడ్జెట్‌తో యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: షాందత్, సంగీతం: సామ్ సి ఎస్, రచన-దర్శకత్వం: వి.వెంకట్.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com